

అక్రమాల ఆధార్ కేంద్రం గుట్టురట్టు

ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఆధార్ ముఖ్యం.. అదే ఆధార్ సెంటర్ నిర్వాహకునికి ఆదాయం తెచ్చి పెట్టింది. ఆధార్ సెంటర్‌లో దందా శుక్రవారం బహిర్గతమైంది. -8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

సిద్దవటం బీటు పరిధిలోని బద్రికోన అటవీ ప్రాంతంలో 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకొని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 295 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట: రాజంపేట నవోదయ (నారమరాజుపల్లె) విద్యాలయంలో 9, 11వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ గీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8న ఉంటుందన్నారు. దరఖాస్తులు ఈనెల 19లోపు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు నవోదయ విద్యాలయం వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. 11వ తరగతికి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. 9వ తరగతికి 8 వ తరగతి చదువుతుండాలన్నారు. అన్నమయ్య, కడప జిల్లాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

12లోపు అందజేయాలి

రాయచోటి టౌన్: డీఎస్సీకి (సెకండ్‌గ్రేడ్ టీచర్స్) ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ డైరెక్టర్ సందప్ప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులకు 200 మందికి రాయచోటిలో ఉచిత శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సంవత్సర ఆదాయం రూ.1లక్ష లోపు ఉండేవారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలం 60 రోజులు ఉంటుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, టీటీసీ మార్కులిస్టులతో పాటు కుల, ఆదాయ, ఆధార్ కార్డులతో పాటు రెండు పాస్ పోర్టు సైజ్ ఫోటోలు జత పరిచి రాజంపేట రోడ్డులోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ సముదాయాలలోని రూం నంబర్-5, బ్లాక్ నంబర్-1లో ఈ నెల 12వ తేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాల కోసం 94940 75135, 99124 45108, 99890 39216లలో సంప్రదించాలని సూచించారు.

12 నుంచి గండిలో పవిత్రోత్సవాలు



గండి వీరాంజనేయ స్వామి

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 12 నుంచి 15వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయకమిషనర్ వెంకట సుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. ఆ రోజు సాయంత్రం అంకురార్పణతో కార్యక్రమాలు మొదలవుతాయని తెలిపారు.13,14 తేదీల్లో పలు హోమాలు నిర్వహించి15వతేదీన మహాపూర్ణాహుతి,మహాకుంభ ప్రోక్షణ తీర్థ ప్రసాద వినియోగంతో పవిత్రోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున ఈవేడుకలకు హాజరు కావాలని వారు కోరారు.

అగ్నివీర్‌కు సన్నద్ధం



దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాసే శ్రామికులు.. మన సైనికులు. భూమాత సేవ కోసం జీవితాన్ని ధార పోసే త్యాగమూర్తులు వారు. అందుకే సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం. సైనికుడవ్వాలని...భారత త్రివిధ దళాల్లో పనిచేయాలని కలలుగనే ప్రతి యువకుడికి అగ్నివీర్ పిలుస్తోంది. ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి కడప క్రీడా ప్రాధికార సంస్థ మైదానం వేదిక కానుంది.



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి వచ్చే అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

- ఈనెల 10 నుంచి 15 వరకు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ
- కడప డీఎస్ఏ మైదానంలో ఏర్పాట్లు పూర్తి
- 4 వేల మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్షలు
- హాజరుకానున్న 13 జిల్లాల అభ్యర్థులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం వేదికగా అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అగ్నివీర్ పథకంలో భాగంగా ఆర్మీలో చేరాలనుకునే వారికి ఇప్పటికే రాతపరీక్ష పూర్తి చేయగా, అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. అగ్నివీర్‌లో భాగంగా జనరల్ డ్యూటీ, టెక్నికల్, ట్రేడ్స్‌మెన్, క్లర్క్/స్టోర్‌కీపర్ తదితర ఉద్యోగాలకు సంబంధించిన ఎంపికలు నిర్వహించనున్నారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ తదితర అర్హతలు కలిగి ఇప్పటికే పరీక్ష రాసి అర్హత సాధించిన వారు ఈ ఎంపికలకు అర్హులు.

4వేల మంది అభ్యర్థులు..

రిక్రూట్‌మెంట్ ర్యాలీకి కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన అభ్యర్థులు 4వేల మంది హాజరు కానున్నారు. ప్రతిరోజు 800 మందికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎత్తు, బరువు, ఛాతి, 1.6 కి.మీ పరుగు పందెం, బీమ్ పుల‌ప్స్, జిగ్‌జాగ్ బ్యాలన్స్ ఆప్టికల్స్ తదితర పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో మెడికల్ టెస్ట్‌లు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి తరలివచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కడప నగరపాలక సంస్థ, ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు మైదానంలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు..మెడికల్ టెస్ట్ పూర్తయ్యే వరకు ఒక క్రమపద్ధతిలో సాగేలా ఏర్పాట్లు చేశారు.

- గ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం రాత్రి పరిశీలించారు. ర్యాలీ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన అన్ని సెక్షన్‌లను పరిశీలించారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీ వివరాలను డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. రిక్రూట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ అమర్‌దీప్‌కుమార్, కడప ఆర్‌డీఓ జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఏర్పాట్లపై ఆర్మీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కక్షపూరిత చర్యలను ప్రభుత్వం విడనాడాలి

- సోషల్ మీడియా కార్యకర్తలకు వైఎస్ఆర్‌సీపీ అండగా ఉంటుంది
- వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



హనుమంతురెడ్డికి భరోసా ఇస్తున్న గడికోట శ్రీకాంత్ రెడ్డి

గాలివీడు: సోషల్ మీడియా కార్యకర్తలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల అక్రమ అరెస్ట్‌కు గురై విడుదలైన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త కె.హనుమంతురెడ్డిని గాలివీడు మండలం అరవీడు గ్రామం కూర్మయ్యగారిపల్లెలో శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి గడికోట శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ, ఎన్నికల హామీలపై ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతుండడం దారుణమన్నారు. ప్రభుత్వం కక్షపూరిత చర్యలను విడనాడాలని ఆయన హితవు పలికారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెట్టాలని కూటమి ప్రభుత్వానికి ఆయన సూచించారు.

మార్చి తర్వాత ఇళ్ల నిర్మాణాల బాధ్యత పేదలదే

హౌసింగ్ పీడీ సాంబశివయ్య



బి.కొత్తకోట కురవానికుంటలో ఇళ్లను పరిశీలిస్తున్న పీడీ

బి.కొత్తకోట: వచ్చే మార్చిలోగా పేదలు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుంటే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందని, ఆ తర్వాత జరిగే నిర్మాణాలకు పైసా కూడా ఇవ్వరని గృహ నిర్మాణ శాఖ పీడీ సాంబశివయ్య అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోటలోని కురవానికుంట, బద్దిపల్లెగుట్ట కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నకాలనీలు, సొంతస్థలాల్లో నిర్మించకుంటున్న ఇళ్లకు మార్చి తర్వాత బిల్లులు ఇవ్వడం జరగదని, లబ్ధిదారులే సొంతంగా నిర్మించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా గృహనిర్మాణశాఖలో అవినీతి ఆరోపణలు లేవని, రాయచోటిలో జరిగిన అవినీతి వ్యవహారంలో ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించామన్నారు. డీఈని ఎండీకి సరెండర్ చేశామన్నారు. మొదటి వందరోజుల్లో 2,954 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యంపై 2,362 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించామన్నారు. రెండో విడత వందరోజుల ఇళ్ల లక్ష్యం 7,374 గృహాలు కాగా ఇప్పటివరకు 1,030 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. 2014–19 మధ్య జరిగిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.38.62 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని ప్రభుత్వం పక్షం రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలకు జమ చేయనుందని చెప్పారు. 500 ఇళ్లకు మించిన లేఅవుట్లు జిల్లాలో 12 ఉన్నాయని, ఇక్కడి నిర్మాణాలపై శ్రద్ధ చూపిస్తూ పనులు చేయిస్తున్నట్టు చెప్పారు. బి.కొత్తకోట జగనన్న కాలనీల్లో మౌళిక వసతులను కల్పించి నిర్మాణాలు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాగా జిల్లాలో హౌసింగ్‌కు రెగ్యులర్ అధికారులు లేరన్నారు. 30 మండలాలకు కేవలం తొమ్మిది మంది మాత్రమే రెగ్యులర్ ఏఈలు ఉండగా వారిలో ఆరుగురు ఇన్‌చార్జ్ డీఈలుగా బాధ్యతలను అప్పగించామని చెప్పారు. మిగిలిన మండలాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఇతరులను ఏఈలుగా నియమించామని చెప్పారు. కార్యక్రమాల్లో డీఈ వెంకటరెడ్డి, ఏఈ లావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రూసెల్లా వ్యాధి నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై



పెయ్య దూడలకు వేస్తున్న వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డా.గుణశేఖర్ పిళ్లై

చిన్నమండెం: సంక్రమిత వ్యాధి అయిన బ్రూసెల్లా వ్యాధిని సమూలంగా నిర్మూలించాలన్నదే ప్రభుత్వ ధ్యేయంగా పెట్టుకున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. చిన్నమండెం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బ్రూసెల్లా వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ పిళ్లై మాట్లాడుతూ బ్రూసెల్లా వ్యాధి నియంత్రణకు 4–8 నెలల వయస్సు గల పెయ్య దూడలకు వ్యాక్సిన్‌ను వేస్తారని, ఈ టీకా ఇచ్చిన 21–60 రోజులలోపు సీరం నమూనాలను సేకరించి బెంగళూరులోని నివేది ఇన్‌స్టిట్యూట్‌కు సీరో కన్వర్షన్ కోసం విజయవాడలోని వీబీఆర్ఐ ద్వారా పంపిస్తారన్నారు. సీరో కన్వర్షన్ ఫలితాలను వీబీఆర్ఐ వారు విశ్లేషించి జిల్లాలకు పంపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు డా.మాలకొండయ్య, కడప వ్యాధి నిర్ధారణ ప్రయోగ శాల సహాయ సంచాలకులు డా.రాజశేఖర్, రాష్ట్ర స్థాయి వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు డా.తనూజ, స్థానిక సహాయ సంచాలకులు డా.శ్రీధర్‌రెడ్డి, పశువైద్యాధికారులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కడపలో జాతీయ ఉర్దూ సెమినార్

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళ డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో జాతీయ ఉర్దూ సెమినార్ జరుగుతుందని జాతీయ సెమినార్ చైర్మన్ సత్తార్ ఫైజీ, అంజుమన్ తరఖీ ఉర్దూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అబ్దుల్ సత్తార్ సాహిర్, సయ్యద్ హిదాయతుల్లా తెలిపారు. ఈ జాతీయ ఉర్దూ సెమినార్‌కు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారని వారు తెలిపారు. ఇందులో భాగంగా 9వ తేదీ ఉదయం ప్రజా ప్రతినిధులతో ప్రారంభ సభ, మధ్యాహ్నం ఉర్దూ భాషాభివృద్ధిలో ప్రభుత్వ పాత్ర, సాయంత్రం సెషన్‌లో ఉర్దూ భాషాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర, రాత్రి జాతీయ కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. అలాగే 10 వ తేదీ ఉదయం ఉర్దూ భాషాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర, మధ్యాహ్నం ఉర్దూ భాషాభివృద్ధిలో ఉర్దూ సంఘాల పాత్ర, సావనీర్, వివిధ రచయితల పుస్తకాల ఆవిష్కరణ, పరిశోధన పత్రాల సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

కమలాపురం: స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం నుంచి 68వ రాష్ట్ర స్థాయి రగ్బీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు అరుణ కుమారి, తిరుపాల్‌రెడ్డి, శివ శంకర్ రెడ్డి తెలిపారు. శనివారం వారు రగ్బీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్న క్రీడా మైదానాన్ని కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డితో కలసి పరిశీలించారు. కాగా క్రీడల నిర్వహణకు, 13 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు వసతులు, సౌకర్యాలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఐపీబీబీ అకౌంట్ల ఓపెన్‌కు ప్రత్యేక శిబిరాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఐపీబీబీ అకౌంట్లను తెరిచేందుకు ఈనెల 15న ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప డివిజన్ పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తపాలాశాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా కొత్త ఖాతాలను తెరిచి ఆధార్‌కు లింకులను సులభతరం చేయడానికి లబ్ధిదారుల కోసం శిబిరాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కొత్త ఐపీబీబీ ఖాతాలను తెరవడం, ఇప్పటికే ఉన్న ఐపీబీబీ అకౌంట్లకు ఆధార్ లింకు చేయడం , మ్యాపింగ్ చేయడం వంటివి తమ లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న 2.65 లక్షల అకౌంట్లు పునరుద్ధరిస్తామని వివరించారు.

పశు గణన పక్కాగా..

- గ్రామాల్లో తిరుగుతూ పశు పక్షాదులను లెక్కిస్తున్న సిబ్బంది
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగనున్న ప్రక్రియ
- జిల్లా ఆర్థికాభివృద్ధిలో పాడి పరిశ్రమల పాత్ర కీలకం



పీలేరులో జరుగుతున్న పశుగణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

రాయచోటి: మనిషి జీవన ప్రమాణాలు, ఆర్థిక ఎదుగుదలలో పశు పక్షాదుల పాత్ర కీలకం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ రంగంలో పశువులు కీలకమైన భాగంగా ఉన్నాయి. అలాంటి పశుపక్షాదులను పక్కాగా గణించి తద్వారా ఈ రంగంలో మరింత అభివృద్ధిని తీసుకరావడానికి ఉద్దేశించిన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా భాగస్వామిని చేసి గ్రామాలలో ఉన్న 16 రకాల పశు పక్షాదులను గుర్తించి వాటిని లెక్కకట్టడానికి అధికారులు కసర త్తు చేస్తున్నారు. ఐదేళ్లకోసారి నిర్వహించే జాతీయ పశువుల గణన ప్రక్రియ జిల్లాలో మొదలైంది. జిల్లాలోని ఆవులు, గేదెల తోపాటు పలు రకాల జీవాలను పశుసంవర్ధక శాఖ అధికారులు లెక్కించనున్నారు.

- పాడి రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి పశు గణనకు శ్రీకారం చుట్టింది. పశువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు, జీవాలకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించే ప్రక్రియను పశుసంవర్ధక శాఖ ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమి లేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశు గణన ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఇది కొనసాగుతుంది. గణకులు, పర్యవేక్షకులు ఇంటింటి సర్వేలో భాగంగా పశువుల వివరాల నమోదు ప్రారంభించారు.

20వ అఖిల భారత పశు గణన సర్వే ప్రకారం..

జిల్లాలో ఆవులు:	2 లక్షల 72 వేలు
గేదెలు:	105000
గొర్రెలు, మేకలు:	20 లక్షలు,
కోళ్లు:	30 లక్షలు

471 రెవెన్యూ గ్రామాల్లో ...

అన్నమయ్య జిల్లా పరిధిలోని 30 మండలాల్లో 471 రెవెన్యూ గ్రామాల (501 గ్రామ పంచాయతీలు)లోని 5 లక్షల కుటుంబాల నుంచి 292 మంది ఎన్యుమరేటర్ల ద్వారా పశు పక్షాదుల గణనను చేపట్టారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. 2025 ఫిబ్రవరి నెలాఖరు లోపు పూర్తి చేయాల్సి ఉంది. ఎన్యుమరేటర్లను ఆయా ప్రాంతాల్లో ఉన్న పశు వైద్యాధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు తదితర పశువుల సంఖ్య, జాతి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. గ్రామాల్లో పశువైద్యశాల, పాల సేకరణ కేంద్రం , పశుగ్రాస క్షేత్రాల సంఖ్య..? పశుసంపద ద్వారా ఎంత ఆదాయం లభిస్తుంది..? తదితర వివరాలను సేకరిస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై తెలిపారు.

యాప్‌లో వివరాలు నమోదు

వ్యవసాయం తరువాత పశు పోషణ కీలకమైంది. జిల్లాలో పశుపోషణపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. నాలుగు నెలలకు పైగా సాగనున్న పశు గణనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపొందించింది. పాడి పరిశ్రమను మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు ఇతర పెంపెడు జంతువులు కలిపి 16 రకాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

లెక్క.. పక్కాగా ఉండేలా చర్యలు

జిల్లాలోని 292 మంది ఎన్యుమరేటర్లు, సంబంధిత ప్రాంతాల్లోని పశువైద్యాధికారులు పర్యవేక్షకులుగా పశు గణన ఇప్పటికే ప్రారంభమైంది. ఇందులో పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు, ఇతర సిబ్బంది కూడా ఉన్నారు. ఈ ప్రక్రియను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే శిక్షణ తీసుకున్న సిబ్బందితో గణన కొనసాగుతోంది. గణనలో చిన్నపాటి తేడా కూడా లేకుండా లెక్క పక్కాగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పశు గణనను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ ప్రక్రియతో భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలు అర్హులకు వర్తిస్తాయి. గ్రామాలు, పట్టణాల్లో గణనకు పశుపోషకులు సహకరించాలి.

– గుణశేఖర్ పిళ్లై, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

మదనపల్లె : కోడి పందెం ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. శుక్రవారం మండలంలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లె సమీపంలో కోడిపందెలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఈ దాడిలో కోడిపందెంలో పాల్గొన్న పది మంది వ్యక్తులను అదుపులో తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 8 ద్విచక్రవాహనాలు, రెండు పందెం కోళ్లు, రూ.35 వేలు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. చిప్పిలి, మదనపల్లె, కర్నాటక రాయల్పాడు తదితర ప్రాంతాల నుంచి వచ్చి కోడిపందెల్లో పాల్గొన్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


అశోక్‌రెడ్డి(ఫైల్)

మదనపల్లె : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గుంటూరుకు చెందిన వెంకటేశ్వర రెడ్డి కుమారుడు యర్రం అశోక్‌రెడ్డి(45) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తూ బెంగళూరులోని కే.ఆర్.పురంలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీన వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. తర్వాత ఇంటికి తిరిగి వెళ్లకపోవడంతో.. ఆందోళనకు గురైన భార్య శ్యామల, కుటుంబసభ్యులు మదనపల్లెకు వచ్చి గాలించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో భర్త కనిపించడం లేదంటూ గురువారం రాత్రి భార్య శ్యామల ఫిర్యాదు చేసింది. ఏఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి


నారాయణ మృతదేహం

మదనపల్లె : జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన చెంగల్‌రాయుడు కుమారుడు నారాయణ(47) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇతడికి ముగ్గురు సంతానం కాగా, కుమారుడు సీటీఎంలో షామియానా సప్లయర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల నారాయణ గ్రామం వద్ద తమ పొలంలో టమాటా పంటను సాగుచేశాడు. అయితే, గిట్టుబాటు ధర రాకపోవడంతో మనస్తాపం చెంది గురువారం సాయంత్రం ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడ్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. అతడి భార్య పద్మావతి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు.

కూలి డబ్బులు అడిగినందుకు దాడి

పెద్దతిప్పసముద్రం : దినసరి కూలి డబ్బులు అడిగినందుకు తనపై దాడి చేశాడని సుజాత అనే బాధితురాలు శుక్రవారం వాపోయింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పోతుపేట పంచాయతీ పిడుంవారిపల్లికి చెందిన సుజాత అనే మహిళ తనకు రావాల్సిన దినసరి కూలి డబ్బులు నరేష్ అనే వ్యక్తిని అడిగింది. ఇందుకు అతను తనను దుర్భాషలాడటమే కాకుండా భౌతిక దాడికి పాల్పడి, ముఖంపై బలంగా కొట్టడంతో నోట్లోని రెండు దంతాలు ఊడి పడ్డాయని సుజాత వాపోయింది. ఈ విషయంపై ఆమె పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొంది.

అక్రమాల ఆధార్ కేంద్రం గుట్టురట్టు

- రద్దయిన మీసేవ కార్యాలయంలో ఏర్పాటు
- రూ.5 వేలు ఇస్తే మార్పులు చేర్పులు
- కలంకలం రేపిన నిర్వాహకుడి వ్యవహారం


మీసేవ సెంటర్ లేకున్నా అందులో ఆధార్ ఇచ్చే కేంద్రంగా కొనసాగిస్తున్న ప్రదేశం ఇదే

రాజంపేట : ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఆధార్ ముఖ్యం.. అదే ఆధార్ సెంటర్ నిర్వాహకునికి ఆదాయం తెచ్చిపెట్టింది. వేలలో వసూళ్లు.. లక్షలో ఆదాయం అన్న రీతిలో ఆధార్ సెంటర్‌లో కొంత కాలంగా చేస్తూ వచ్చిన దందా శుక్రవారం బహిర్గతమైంది. ఈ విధంగానే మరికొన్ని ఆధార్ సెంటర్లలో జరుగుతున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. పట్టణ ప్రధాన రహదారిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో రద్దు అయిన మీసేవా సెంటర్‌లో ఏపీజీబీలో కొన్నాళ్ల పాటు నిర్వహించిన నిర్వాహకుడి గడువు ముగిసింది. అప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఉన్న మహబూబ్‌బాషా నిర్వహిస్తున్న మీసేవా సెంటర్ రద్దు చేశారు. ఫినో బ్యాంకు పేరుతో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పుడు అక్కడి నుంచి ఆధార్ దందాను యథేచ్ఛగా కొనసాగించారు. తాను చేస్తున్న ఆధార్ అక్రమ వ్యవహారం బయటికి పొక్కనీయకుండా కొందరితో లాలూచీ కుదర్చుకోవడం ద్వారా సాఫీగా కొనసాగిస్తూ వచ్చారు.

రూ.5 వేలు ఇస్తే ఎటువంటి ఆధారైనా..

రూ.5 వేలు ఇస్తే ఎటువంటి ఆధారైనా ఇచ్చే విధంగా సెంటర్ కొనసాగుతోంది. చాలా మందికి ఎటువంటి ప్రూఫ్ లేకున్నా కూడా దొడ్డిదారిలో ఆధార్ పత్రాలను క్రియేట్ చేయడంతో.. రోజురోజుకు ఈ ఆధార్ సెంటర్ అక్రమదారులకు ఆధారంగా నిలిచింది. ఆధార్‌లో చేర్పులు, మార్పులు లాంటివి చేసి ఎటువంటి అభ్యంతరాలు, ఇబ్బందులు లేకుండా.. జారీ చేయడంతో ఈ ఆధార్ సేవా కేంద్రం అక్రమార్కులకు ఉపాధి కేంద్రంగా మారింది.

రెండు రోజుల్లోనే.. డేట్ ఆఫ్ బర్త్ ..

డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌కు రూ.3500 నుంచి రూ.4000 వరకు వసూలు చేస్తున్నారు. డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లో పుట్టిన ప్రాంతం కాకుండా వేరే ప్రాంతలో పుట్టినట్లు జనరేట్ చేసి సర్టిఫికెట్ ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మార్వో, వీఆర్వోతో పనిలేదు. అధికారులకు సంబంధించిన బోగస్ సీల్ ఉన్నాయని సమాచారం. దాని ద్వారా ఏ సర్టిఫికెట్ అయినా ఇస్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి. రెండు రోజుల్లోనే డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ చేతికి ఇచ్చేశారు.

చేయి తడిపితేనే.. లేకుంటే నెలలే..

ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవాలంటే అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిందే. లేకుంటే నెలల తరబడి ఆధార్ కేంద్రం చుట్టు ప్రదిక్షణలు చేయాల్సి వస్తోంది. కొంతమంది డబ్బులు చెల్లించలేక విద్యార్థులు లబోదిబోమంటున్నారు. పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు నిఘా కొరవడిన నేపథ్యంలో ఆధార్ నిర్వహణ అడ్డదారి తొక్కింది. ఆరోపణల నేపథ్యంలో అధికారులు ఆధార్ సెంటర్ ఐడీ బ్లాక్ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

తహసీల్దారు ఏమంటున్నారంటే..

ఈ విషయంపై స్థానిక తహసీల్దారు పీర్‌మున్నీని వివరణ కోరగా.. విచారణ చేయడం జరుగుతోందని, ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారిని పంపించామన్నారు. పూర్తి వివరాలను సేకరించాలని కోరామన్నారు. తదుపరి చర్యలు ఉంటాయని వెల్లడించారు.

అర్ధరాత్రి ఆడబిడ్డను ఇంటికి చేర్చిన పోలీస్

– శభాష్ పోలీస్ అంటూ మెచ్చుకున్న వైనం

రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో జగన్ అనే పోలీస్ కానిస్టేబుల్ విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులలో భాగంగా చెన్నైకి వెళ్లి పని ముగించుకొని గురువారం రాయచోటికి చేరుకున్నాడు. బస్టాండ్‌లో బస్సు దిగి కొత్తపేటలోని తన ఇంటికి వెళ్లుతున్నాడు. సమయం సుమారు 12–30 గంటలు అవుతోంది. ఆయనకు మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో రోడ్డుపై ఒంటరిగా ఓ యువతిని కనిపించింది. చూసిన వెంటనే 'ఆయన నీవు ఎవరు.. నీ పేరేమిటి.. ఈ అర్ధరాత్రి సమయంలో ఇక్కడేమి, ఒంటరిగా ఉన్నావెందుకు' అంటూ ప్రశ్నించాడు. మా ఊరు పట్టణానికి సమీపంలోని కృష్ణాపురం అని, తన పేరు లక్ష్మి అని చెప్పింది. ఇక్కడేమి చేస్తున్నావని మళ్లీ అడిగాడు. మాఅమ్మ, నాన్నలు తనను మందలించడంతో.. ఇంటిలో నుంచి వచ్చేశానని, తిరిగి ఇంటికి వెళ్లడానికి మనసు ఒప్పడం లేదని బదులిచ్చింది. వెంటనే ఆయన స్పందించి దగ్గరకు వెళ్లి వారి ఇంటి వివరాలు అడిగి తెలుసుకొన్నాడు. అమ్మాయి తల్లి దండ్రులకు ఫోన్ చేసి అక్కడికి రమ్మని పిలిచి తల్లిదండ్రులకు, ఆ యువతికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆటోను పిలిచి.. వారికి ఆటో బాడుగ కూడా ఇచ్చి ఇంటికి పంపించేశాడు. జరిగిన విషయం సీఐ చంద్రశేఖర్‌కు, ఎస్ఐ మహమ్మద్ జహీర్‌కు తెలిపాడు. డ్యూటీలో ఉంటూ ఇలా చేయడం అభినందనీయమని వారితోపాటు స్నేహితులు, పలువురు 'శభాష్ పోలీస్' అంటూ ఆయనను అభినందిచారు.

మాధవరంలో విజిలెన్స్ దాడులు


పట్టుకున్న రేషన్ బియ్యం పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామంలో గురువారం అర్ధరాత్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించి 150 బస్తాలకు పైగా రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామ పొలాల్లో అక్రమ రేషన్ బియ్యం స్టాక్‌పాయింట్‌పై దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 150 బస్తాలకు పైగా రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నామన్నారు. చుట్టు పక్కల పొలాల్లోని రైతులను అక్రమ రేషన్ బియ్యంపై విచారించగా జంగాలపల్లె గ్రామానికి చెందిన రాజు అక్రమ బియ్యం బస్తాలను నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని ఒంటిమిట్ట బియ్యం గోడౌన్‌కు తరలించామని ఆయన చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు గంగాధర్, అశోక్‌కుమార్, సివిల్‌సప్లయ్ డీటీ సౌజన్య, వీఆర్వో శివశంకర్ పాల్గొన్నారు.

రెండు కుర్చీలాట..!

- తిరుపతి డీఈఓకు మదనపల్లె డీవైఈఓగా అదనపు బాధ్యతలు
- విద్యాశాఖ వింతవైఖరి


మదనపల్లె ఉప విద్యాశాఖ కార్యాలయం

మదనపల్లె సిటీ : ఆయన తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు ఉప విద్యాశాఖ అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఆ అధికారి రెండు కుర్చీలాట ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖ వింత వైఖరి అవలంబిస్తోంది. గత నెల అక్టోబర్ 24న జిల్లా విద్యాశాఖ అధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా పని చేసే కె.వి.ఎన్.కుమార్‌ను తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లా మదనపల్లె డీవైఈఓగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. తిరుపతి జిల్లాలో ఏడు నియోజకవర్గాలున్నాయి. విద్యాశాఖలో తిరుపతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మదనపల్లె డీవైఈఓ పోస్టు అదనంగా ఇవ్వడంపై పలువురు విద్యావేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి జిల్లాతో పాటు మదనపల్లె డివిజన్ పరిధిలోని 18 మండలాల పరిధిలోని పాఠశాలలను ఎలా పర్యవేక్షిస్తారని పలువురు అంటున్నారు. గత నెలలో పోస్టింగ్స్ ఇవ్వగా నవంబర్ 8న (శుక్రవారం) మదనపల్లె డీవైఈఓ కార్యాలయంకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి డీవైఈఓ హాజరుకాకపోవడంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మండిపడ్డారు.

గాడితప్పుతున్న విద్యాశాఖ పాలన:

మదనపల్లె డివిజన్ విద్యాశాఖ పాలన గాడితప్పుతుంది. రెగ్యులర్ డీవైఈఓ శ్రీరాంపురుషోత్తంకు పదోన్నతిపై బాపట్ల డీఈఓగా వెళ్లారు. పాఠశాలల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో విద్యాశాఖ కుంటుపడుతోంది. త్వరలో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. దీంతో పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. మదనపల్లెకు రెగ్యులర్ డీవైఈఓ నియమించాలని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

12 ఎర్రచందనం దుంగల స్వాధీనం

- స్మగ్లర్ అరెస్ట్
- 8 మంది కూలీలు పరారీ


పట్టుకున్న దుంగలు, కారు, స్మగ్లర్‌తో రేంజర్, అటవీ సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం బీటు పరిధిలోని బద్రికోన అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి 12 ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకొని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో రేంజర్ కళావతి శుక్రవారం వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో గురువారం రాత్రి సిద్దవటం బీటులోని బద్రికోన అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టామని తెలిపారు. కొంతమంది ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేసేందుకు కారులో లోడ్ చేస్తూ కనిపించారన్నారు. వారు తమ సిబ్బందిని చూసి పరారవుతుండగా.. వెంబడించి దాడులు జరిపి ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అక్కడ లభ్యమైన 12 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన స్మగ్లర్‌ను విచారణ చేయగా.. తనది నెల్లూరు జిల్లా కలువాయి మండలం తిరుమలపాడు గ్రామం, తన పేరు వెంకటేష్ అని చెప్పారన్నారు. తనను బెంగుళూరులోని కటికినహల్లి గ్రామానికి చెందిన హైయాజ్ తనకు కారు, 8 మందిని కూలీలను ఇచ్చి ఎర్రచందనం దుంగలను తీసుకుని రావాలని చెప్పారన్నారు. 8 మంది కూలీలు పరారయ్యారని చెప్పారన్నారు. పరారైన వారి కోసం తమ సిబ్బంది విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగల బరువు 274 కిలోలు ఉండగా, వీటి విలువ రూ.76,120 చేస్తుందన్నారు. ఈ మేరకు స్మగ్లర్ వెంటేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. వెంకటేష్‌ను తిరుపతి కోర్టులో హాజరు పరుస్తామని రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు ఆఫీసర్‌లు పెంచల్‌రెడ్డి, విశ్వనాథ్, సాబ్‌బావి బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేటలో కూంబింగ్

రాజంపేట : రాజంపేట రేంజ్ పరిధిలోని శేషాచలం అటవీ ప్రాంతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు కూంబింగ్ నిర్వహించారు. శుక్రవారం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. కూంబింగ్‌లో మరి కొంత మంది పరారీ అయ్యారు. 23 ఎర్రచందనం దుంగలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కూంబింగ్ కొనసాగింది. కాగా తమకు సంబంధం లేదని, తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్మగ్లర్లను పట్టుకున్నారని రాజంపేట రేంజర్ దత్తాత్రేయ తెలిపారు.

బైక్‌ను జింకలు ఢీకొని దంపతులకు గాయాలు

ములకలచెరువు : జింకల గుంపు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని మద్దినాయునిపల్లె పంచాయతీ నాయునివారిపల్లెకు చెందిన దంపతులు గంగులప్ప(30), సుకన్య(27)లు వారి ద్విచక్రవాహనంలో వేపూరికోటకు వచ్చారు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వెళ్తుండగా చీకుచెట్టుపల్లె వద్ద జింకల గుంపు అడ్డుగా వచ్చింది. అవి బైక్‌ను ఢీకొనడంతో.. వారిద్దరికీ తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను 108 సహాయంతో మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఇద్దరు రైతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు... తంబళ్లపల్లె మండలం రేణుమాకుల పల్లెకు చెందిన ఆంజనేయరెడ్డి(28), కురబలకోట మండలం ముదివేడుకు చెందిన పాపిరెడ్డి(58) శుక్రవారం తమ ద్విచక్రవాహనంలో కర్నాటక రాష్ట్రం చింతామణికి వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో బురకాయలకోట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

చిరుత దాడిలో మేక మృతి


మృతి చెందిన మేకను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, స్థానికులు

నిమ్మనపల్లె : చిరుత పులి దాడిలో ఓ మేక మృతి చెందిన సంఘటన నిమ్మనపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. మండలంలోని ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లెకు చెందిన పి.రామయ్య యథావిధిగా గురువారం కూడా తనకున్న మేకలను మేత కోసం ఊరికి సమీపంలోని చిడతనగుట్ట కొండ ప్రాంతానికి తోలుకొని వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా ఒక మేక కనిపించకుండా పోవడాన్ని గుర్తించాడు. శుక్రవారం ఉదయం మేక కోసం వెతకగా చిడతనగుట్టలో చిరుత దాడిలో మేక మృతి చెందినట్లుగా తెలుసుకుని, సమాచారాన్ని వెంటనే తవళం బీట్ అటవీ శాఖ అధికారి దీపకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారి దీప, రెవెన్యూ అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, స్థానికులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వన్యప్రాణుల వల్ల నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. చిరుత సంచారం పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిరుతసంచారాన్ని గమనిస్తూ, దారి మళ్లించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంతానికి సమీపంలో రాత్రి వేళల్లో మేకలు, గొర్రెలను, ఆవులను ఉంచరాదన్నారు. అధికారులతోపాటు మాజీ సర్పంచ్ రమణ, ఎంపీటీసీ వెంకటరమణ, రాజగోపాల్, స్థానికులు ఉన్నారు.

పట్టాలు ఇచ్చారు.. ప్రభుత్వ స్థలమని బోర్డు నాటారు


లబ్ధిదారులకు ఇచ్చిన పట్టా భూమిలో జేసీబీ సహాయంతో చదును చేస్తున్న దృశ్యం

రాయచోటి : గతంలో పట్టాలు ఇచ్చిన భూమిలోనే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో.. రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు. శుక్రవారం సంబేపల్లె మండల పరిధిలోని నారాయణరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామం ముదినేనివాండ్లపల్లె సమీపంలోని సర్వే నెంబరు 392/2లో అర్హులైన లబ్ధిదారులకు డీ పట్టాలను గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు ఇచ్చారు. అయితే ఇప్పుడు మాత్రం అదే భూమిలో ఇది ప్రభుత్వ భూమి అని బోర్డును నాటడంతో ప్రజల్లో చర్చనీయ అంశంగా మారింది. ప్రభుత్వం మారగానే అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో భూమిని జేసీబీ యంత్రాలతో.. లబ్ధిదారులు కొలతలు వేసి నాటుకున్న రాళ్లను తొలగించి చదును చేయడం దారుణమని మండల ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఈ విషయంపై సంబేపల్లె తహసీల్దార్ వెంకటేశ్వర్లను వివరణ కోరగా.. లబ్ధిదారులు వారికి ఇచ్చిన ఆధారాలతో రెవెన్యూ అధికారులకు అందజేస్తే వాటిని పరిశీలించి న్యాయం చేస్తామని తెలియజేశారు.

పలువురు సీఐల బదిలీలు

రాయచోటి : వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

సీఐ పేరు	ప్రస్తుతం పని చేస్తున్నది	బదిలీ అయిన ప్రాంతం
ఎస్.మహమ్మద్ అలీ	వీఆర్ కడప	మన్నూరు (రాజంపేట)
డి.రామాంజనేయులు	మన్నూరు	వీఆర్ అన్నమయ్య
బి.లక్ష్మన్న	ఉమెన్ పీఎస్ చిత్తూరు	ములకలచెరువు సర్కిల్
పి.రాజా రమేష్	ములకలచెరువు సర్కిల్	ఎస్‌బీ–3 అన్నమయ్య
బి.వెంకట చలపతి	ఎస్‌బీ–3 అన్నమయ్య	ఆలూరు సర్కిల్ (కర్నూలు జిల్లా)
ఎ.మోహన్‌కుమార్	డీసీఆర్‌బీ అన్నమయ్య ఉమెన్ పీఎస్–2	అన్నమయ్య (మదనపల్లె ట్రాఫిక్)
కె.ఎరీసావలీ	డీఎస్‌బీ–2 నంద్యాల	మదనపల్లె వన్‌టౌన్
ఎ.చాంద్‌బాష	మదనపల్లె వన్‌టౌన్	వీఆర్ అన్నమయ్య
ఎ.సత్యనారాయణ	వీఆర్ అన్నమయ్య	డీఎస్‌బీ–2 అన్నమయ్య
జె.శంకరయ్య	డీఎస్‌బీ–2 అన్నమయ్య	డీసీఆర్‌బీ అన్నమయ్య

రేపు 'బ్రౌన్' జయంతి ఉత్సవం

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 226వ జయంతిని ఈనెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. ఇందులో భాగంగా స్మారక ఉపన్యాసం, సాయంత్రం 3 గంటలకు అష్టావధానం ప్రత్యేక కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి, విశిష్ట అతిథులుగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, గౌరవ అతిథిగా విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సంజీవమ్మ హాజరవుతారన్నారు. ప్రధానవక్త, స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ విద్వాన్ పసుపులేటి శంకర్ బ్రౌన్ సాహితీ సేవ అనే అంశంపై ప్రసంగిస్తారని, సంగీత అధ్యాపకులు యలమర్తి మధుసూదన్ కావ్య పఠనం చేస్తారన్నారు. మధ్యాహ్నం ప్రముఖ అవధాని శారదా ప్రసన్న (ఎంవీఎస్ఎల్ ప్రసాద్) అధ్యక్షతన 'శతావధాని' ఉప్పలధడియం భరత్ శర్మ (తిరుపతి) అష్టావధానం నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు పృచ్ఛకులుగా పాల్గొంటారని తెలిపారు.

చెరువును తోడేస్తున్న ఇసుకాసురులు


రామానాయిని చెరువులో జేసీబీలతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

గుర్రంకొండ : 'అంతా మా ఇష్టం మమ్మల్ని అడిగేదెవరు' అంటూ ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. చెరువు నిండా ట్రాక్టర్లు, జేసీబీలతో జాతరను తలపిస్తున్నా.. అటువైపు కన్నెత్తి చూసే అధికారులు కరువయ్యారు. మండలంలోని తరిగొండ రామానాయిని చెరువు మండలంలోనే అతి పెద్ద ఇరిగేషన్ చెరువు. ఇందులో ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. వీటిపై కొంత మంది అధికార పార్టీ నేతల కన్ను పడింది. గత నెల రోజులుగా జేసీబీలు పెట్టి చెరువులోని ఇసుకను ఇష్టానుసారంగా తోడేస్తున్నారు. ఒక జేసీబీకి ఎనిమిది ట్రాక్టర్లు చొప్పున ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. గృహ అవసరాల కోసం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే జేసీబీలతో తోడేయమని ఎక్కడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయినా ఇవేమీ తమకు పట్టవంటూ కొంతమంది నేతలు ఇసుకను జేసీబీలతో రాత్రిబంవళ్లు తోడేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుకను రూ. 3300 వరకు విక్రయిస్తున్నారు. గుర్రంకొండ, కురుబలకోట, వాల్మీకిపురం, పెద్దమండ్యం మండలాలకు ఇసుకను అక్రమంగా తరలించుకు పోతున్నారు. ఇసుక విషయమై అధికార పార్టీకి చెందిన ఓ వర్గం నేతలు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటనలు చోటు చేసుకొన్నాయి. స్వయంగా అధికార పార్టీ నేతలే అధికారులకు ఫిర్యాదు చేసే స్థాయికి వచ్చారంటే ఏ స్థాయిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందో తేటతెల్లమవుతోంది. రామానాయిని చెరువులో గత వారం రోజులుగా జేసీబీలతో వందలాది లోడ్ల ఇసుకను అక్రమంగా తరలించేశారు. శుక్రవారం రోజు కూడా జేసీబీలతో ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నా అటు పోలీసులు గానీ, ఇటు రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకొని చర్యలు తీసుకొన్న దాఖలాలు లేక పోవడం గమనార్హం.

10న ఉచిత మెగా వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కాళ్లలో సిరలవాపు వ్యాధి(వెరికోస్ వెయిన్స్)పై కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 10న నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. డీఎస్పీ కార్యాలయంలో వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ వైద్యులు డాక్టర్ వినయ్ న్యాపతి, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ హరీష్ రాజ్‌కుమార్ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు ఉచిత వైద్య సేవలందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఆంజనేయులు, శ్రీనివాసులు, రామాంజనేయరెడ్డి, నాగరాజు, సుబ్బరామయ్య, శ్రీనాథ్ రెడ్డి, సురేంద్ర, సర్దార్, మీడియా సభ్యులు పాల్గొన్నారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

పెద్దమండ్యం : మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తుస్సావారిపల్లెలో శుక్రవారం పట్టపగలే దొంగలు రెండు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామంలోని రాములమ్మ, కొండ్రెడ్డిలు వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ పనులు ముగించుకుని ఇండ్లకు వచ్చిన రైతులు.. తాళాలు పగలకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లోని వస్తువులను చెల్లా చెదురుగా పడేసిన దొంగలు బీరువాలలో ఉన్న నగదు, నగలను దోచుకెళ్లినట్లు రైతులు తెలిపారు. చోరీ జరిగిన రెండు ఇళ్లను ఎస్ఐ పీవీ రమణ పరిశీలించారు. కొన్ని రోజులుగా మండలంలో పగటి పూట దొంగతనాలు పెరిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బోరు మోటార్లు అపహరణ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూర్లపల్లికి చెందిన సుబ్బిరెడ్డి అనే రైతుకు చెందిన బోరు మోటారును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. అదే విధంగా పోతుపేటకు చెందిన వెంకటరెడ్డి అనే రైతుకు చెందిన మరో బోరు మోటారును కూడా దుండగులు గుట్టుగా తీసుకెళ్లారు. చోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు శుక్రవారం పేర్కొన్నారు.

11న కడప కామెడీ షో

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమి ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకుని నిర్వహించనున్న కామెడీ ప్రదర్శన కార్యక్రమానికి కడప ఉర్దూ కళాకారులకు ఆ సంస్థ డైరెక్టర్ మస్తార్ నుంచి ఆహ్వానం అందింది. ఈ కామిడీ షోలో కడప ఉర్దూ కళాకారులు మస్బుల్ అహ్మద్, మహబూబ్‌బాషా, షహుద్దీన్, సత్తార్‌ఫైజీలు పాల్గొననున్నారు. వీరంతా ఈ కామిడీ షోలో ఉర్దూ హాస్యనాటిక, మైమ్, మిమిక్రీ, ఏకపాత్రాభినయం వంటి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.